
# మబ్బు విడని ఆకాశం

## తిరుపతయ్య



అబ్బబ్బ! ముసురు వెధవ ముసురు. విసుగంతా బజార్లో కుప్పబోసినట్లు ముసురు. చిల్లులు పడ్డ ఆకాశంనుండి చెదరిపడుతున్న ముసురు. ఎడతెగని ముసురు. ఛీ!ఛీ! బురద పాడుబురద. కసువంతా తడిపి రోడ్డుమీద వెదజల్లినట్లు బురద. చినిగిపోయిన భూమి చెదలుపడుతున్నట్లు బురద అంతటా బురద. ముసురు—వెధవ ముసురు. బురద—పాడుబురద.

సందడిగా ఉండే రోడ్డు చప్పబడి పోయింది. కొత్త సినిమా విడుదలై వారం కాలేదు. పదిమంది కన్నా ఎక్కువ లేరు బుకింగ్‌వద్ద. విసుక్కుంటూ, చుట్టలు కాలుస్తూ కూర్చున్నారో చోట— చుడువా వాలా, బరానీవాలాలు హోటల్ ముందు బీడీలు కాలుస్తూ కూర్చున్నారు సప్లైయర్లు. క్యాష్ బాక్సు వద్ద దిగాలుపడి కూర్చున్నాడు ప్రొప్రయిటర్. గిరాకీలేదని కాలాబజార్ మెంబర్లు, మఫ్లర్‌లు చుట్టుకుని కిళ్లీవాలా దగ్గర బాతాఖానీ చేస్తున్నారు. అందరి చుట్టూ ముసురు.

జనంలేరని, శైవైపోయినా కూనిరాగాలతో విసుక్కుంటోంది సినిమాహాలు.జనం లేరని బొంగురు గొంతుకతో విసుక్కుంటోంది హోటల్ రేడియో. కాలాబజార్ బ్రతుకులూ, కారాఖిల్లీ బ్రతుకులూ విసుక్కున్నాయి. జనం లేరని ఆనందరావుతోపాటు అతని జేబులోని బ్లేడుముక్కా విసుక్కుంది. ముసురు ముసురు—వెదవ ముసురు విసుగు విసుగు—ముసురు లాంటి విసుగు. ఎడతెగని ముసురులా ఎన్నడూలేని విసుగు.

అటూ ఇటూ పచార్లు చేశాడానందరావు. అణా హోటల్—సింగిల్‌చాయ్ త్రాగేలోగా ఆగు తుందా ముసురు ఆగిపోగానే విరగబడి వస్తారా జనం? వచ్చినవారి జేబుల్లో నిండిన జేబులుంటాయా? పట్టుబడకుండా బ్లేడుముక్క పని చేసుకుంటుందా? రేపు ప్రొద్దున తాను వంద రూపాయలివ్వగలడా? ఛఛ! ప్రశ్నలు. ముసురులాంటి ప్రశ్నలు. తగ్గనే లేదు ముసురు తల ఒగ్గనేలేదు విసుగు. చీదరించు కున్నాడానందరావు మనసులో.

'ఎవరీ ఆనందరావు? ఎందుకింత చీదర?' తనకు తనే ప్రశ్నించుకున్నాడు. తగిన సమాధానం దొరుక లేదు. తీరిగ్గా ఆలోచించుకు విప్పాల్సిన ముడి తొందర పడితే బిగుసుకుపోతుంది. జేబుల్లో చేతులేసుకుని వూగులాడుతూ అద్దెకొంపకు చేరాడు. ఆలోచనల్లో మునిగిపోయిన ఆనందరావు అద్దంలో చూచుకున్నాడు.

* * *

అతడు.. అక్కడక్కడ చినిగిన తెల్లని ఇస్త్రీ బట్టలు, పాతవైనా పాలిష్ చేసిన బూట్లు, ఆరోగ్యం లేని అందమైన ముఖం, సంస్కారంలేని వంకు వంకుల జుత్తు, పైసా లేనివాడు బాధ పట్టించుకోని రూపం. అతడే ఆనందరావు. తల్లిదండ్రుల కానం దం. స్నేహితుల కానందరావు. మేనమామకు తోక లేని నంది. పోలీసుల కానందరావు కే. డి.

"తండ్రిపోయినాసరే మేనమామ ఉండాలట." తల్లీ తండ్రీ పోయినా ఆనందరావుకు మేనమామ ఉన్నాడు. ఉన్నాడు కాబట్టే అతని పంచన చేరాడు. పంచన చేరాడే కాని బాగుపడలేకపోయాడు. బాగు పడలేకపోయినా బాధపడిపోయాడు. బాగుపడ

ఈ రాత్రే—ఆరాత్రి కాదు—ఆరాత్రి లేదు.

*　　　*　　　*

ఆరాత్రి భాగ్యలక్ష్మి దక్కకుండాపోయిందని, ఆమె కన్నుల్లో నీడ చూచుకోలేవని, ఆమె నవ్వుల్లో వెలుగు నోచుకోలేవని, ఆమె హృదయంలో నిద్ర పోలేవని, ఆమె సమక్షంలో మరణించలేవని—"తండ్రి పోయినా బ్రతికున్న మేనమామ" ఇంజనీరుతో భాగ్యలక్ష్మి పెళ్లి చేసి మరీ తెలిపాడు.' బాగుపడని వాడికా భాగ్యలక్ష్మి! ఎలా బాగుపడాలి? ఎందుకు బాగుపడాలింకా?

చికాకుల చీకట్లో చిక్కుకున్న జీవితమని, ఏకాంతపు రాపిడిలో పొగచూరిన జీవితమని, చినిగి పోయి చీకిపోయి చెదలంటిన విస్తరాకు—చెత్తకుండి, ఎంగిలాకు, మురుగు కాల్వ, రొంపిరోడ్డు—ప్రవాహాల మడిగుండం పాలైపోయిన బ్రతుకని, తనకన్నా మునిసిపాలిటీ లైసెన్సులేని కుక్కనయమని, తనకు తాను పిచ్చివాడు, తనకు తాను చచ్చినాడు.

కనకలక్ష్మి కౌగిలిలో చచ్చిపోయి బ్రతికినాడు. స్వర్గంలాంటి నరకంలో, వెన్నెల లాంటి చీకటిలో, ఆనందం లాంటి విషాదంలో, సుఖం లాంటి దుఃఖంలో చావుబ్రతుకు బ్రతికినాడు. చితికిపోయి బ్రతికినాడు.

పెళ్లికాని కనకలక్ష్మి పరువులేని పడుపువృత్తి కనకలక్ష్మి వయసులేని వెల కట్టిన కనకలక్ష్మి ఇష్టం లేని తననే ఆ పడగ నీడ ఆకర్షిస్తే, ఇష్టమున్న వాడింక తప్పించుకుంటాడా! అందరికీ కనకలక్ష్మి ఎందరికో కనకలక్ష్మి. ఇష్టముండే తాను బ్రతుకు తున్నాడా? ఇష్టం—అయిష్టం. కష్టం నష్టం మబ్బా—ముసురా. ముసురా—విసురు. విసురా —విసుగు. పాడుముసురు. విసుగు ముసురు.

*　　　*　　　*

అబ్బబ్బ! ముసురు—రాక్షసి ముసురు—ఎందుకి ముసురు? ఎందుకీ విసుగు? ఈ విసుగుకు కారణం ఆమేనా? ఆశతో నిండిన కన్నుల్లో రేపెలా చూడడం — చూడకుండా ఉంటే — చూడాలి. తప్పకుండా పోవాలి. ఆమె ఎవరామె? ఆమె తనకెవరు? తానామె కెవరు?

*　　　*　　　*

బిజినెస్ ఎక్స్‌ప్రెస్‌కాక ప్లాట్‌ఫారం సర్వే చేస్తున్నాడా రోజు. పాసెంజర్ వచ్చింది పోయింది.

# ముబ్బుపీడని ఆకాశం


చెదరిన ముంగురులూ వాడిపోయిన ముఖమూ దయనీయమైన రూపూ, జాలిగొలుపు చూపూ, చేతిలో సూటుకేసూ, మెడలో గొలుసూ, కాటుక లేకున్నా కన్నుల్లో కాంతి దీపాలు. ఆమె కనిపించింది.

ప్లాటుఫారం పలుచబడినా ఎటూ పోలేదామె. ఎగిరొచ్చిన పిట్టనుకున్నాడు. రోమియో చూపుల్తో రెండు రౌండ్లు కొట్టాడు ఈలపాట పాడాడు. భుజం నిండా కొంగు కప్పుకుని 'రండ'ని పిలిచింది. తనను కాదని వెనుదిరిగి చూచాడు. కాదు తననే. మెల్లగా పోయాడు. ఏమిటన్నట్లు చూచాడు.

"నేనీ వూరికి కొత్త. నాకీ వూళ్లో ఎవరూ తెలి యదు నాకు మీ సహాయం కావాలి. ఈ వూళ్లో బస కావాలి. ఇంకెవర్నీ ఆశ్రయించలేను. మీ మేలు మరచిపోలేను" ఆశ్చర్యంతో శిలే అయిపోయి 'అంత కన్నానా' అనుకున్నాడు ఆదుకొని అనుభవించాలను కున్నాడు. సూటుకేసు— గొలుసు —అందమైన వయసు— ఎగిరొచ్చిన పిట్ట. ఆడబోయిన తీర్థం ఎదురే వచ్చింది.

తనకు తెలిసిన ఓ ముసిల్దానింట్లో బస కుదిర్చాడు. వూరడిగాడు పేరడిగాడు. పార్వతి పాపాలంలా ఉంది. మనసుకు నచ్చని పెళ్ళట, ముసిలివాడితో పెళ్ళట, బ్రతికి చెడిన తండ్రట, బలవంతపు పెళ్ళట, పారిపోయి వచ్చిందట. దారి వెదుక వచ్చిందట, ఎస్సెల్సీ పాసయిందట, ఉద్యోగం చూచుకొంటుం దట ప్రతివాక్యమూ హృదయాన్ని కరిగింప చేసింది. ప్రతిముక్కా ఆలోచనల్ని అదరగొట్టింది

తన గురించడిగినపుడు 'మూర్తి'ని చెప్పాడు వూరూ ఉద్యోగమూ కల్పించే చెప్పాడు. పెళ్ళి కాలేదని నిజమే చెప్పాడు నిజం మీద ప్రేమతో కాదు, పార్వతి మీద కన్నుంచి. ఎన్నో మాటలు. ఎన్నో మార్పులు. జేబులోని పాతికా ఇచ్చాడు. కళ్ళతో నవ్వి గొలుసు తీసింది తాకట్టు పెట్టమంది. ఆలోచన మెరుపులా కదిలింది. చేతిలో పడుతోంది సులభంగా. కాని అదేమిటీ! అంతరాత్మ! తనకూ ఉందా! కాటుకలేని కన్నుల్లో తళుక్కున మెరసిన కన్నీరు—చాటుగా పోయి వినిపించే వెక్కివెక్కి ఏడ్పు అమ్మమ్మ పెట్టిన ఆస్తి అదొక్కటేనట. కరి




పోయి మసిపైపోయా డాక్షణంలో.

ఆలోచన అడవుల్లో కాలు తిరగడంలేదు. తానెవరో తెలిస్తే తనతో అలా వస్తుందా? తానెవరో తెలిస్తే తనకలా ఇస్తుందా? నేనెవరు? నేనెవరు? కోటి సమ్మెటలు కణతల్లో మ్రోగాయి. శతకోటి బాణాలు మనసులో నాటాయి. అనంతకోటి పర్వతాలు హృదయంలో పగిలాయి"వద్దు..వద్దు.. వద్దే వద్దు" అన్నాడు అన్నింటినీ సమకూర్చి అర్థరాత్రి దాటాక వచ్చాడు. ఏదో తృప్తి ఆరాత్రి. స్పష్టంకాని ప్రశాంతి. ఏదో అలజడి ముసుగులో కనిపించని ఆలోచనల వడి.

*　　　*　　　*

అబ్బబ్బ! ఈ ముసురు ముసుగులోకం మీద ఎంతసేపు! తనకీ విసుగు ముసుగు ఎంతసేపు. ఎందుకీ విసుగు? నిన్న రాత్రి ప్రారంభమైన ముసురు ఇవ్వాళ రాత్రి దాటిపోయినా ఆగదేం—తెల్లవారాక పోతుందేమో! పోతుంది పోతుంది.

*　　　*　　　*

రేపు పోవాలి. ఆమె అడిగిందీయాలి. రోజూ పదో పాతికో ఇచ్చాడు ఒకరి కంచంలో దింకొకరికి. పొగొట్టుకున్నవాడు తిడతాడు. పొందిన నోట పొగడ్త. రెండూ కొట్టుడుబోతే తనకేం మిగిలింది? ఇంతకుముందు లేనిదేదో ఉంది. ఇంతకుముందున్న దేదోలేదు. అదే మిగిలింది తనకు.

నిన్నరాత్రి ప్రారంభమైంది ముసురు. ఆమె తనూ లోపల. బయట ముసురు లోన విసురు. వందరూపాయలుంటే ఉద్యోగం వస్తుందంది. రేపు సాయంత్రం తానిస్తానన్నాడు. ఉద్యోగం దొరికాక ఏం చేస్తావన్నాడు. ఎన్నో మాటలు. మాటల్లో పెళ్లి విషయం వచ్చింది పెళ్ళి చేసికోవాల నుందంది. నీడలో పెంచే దయ ఉంటే తననే చేసుకొమ్మంది. ఆశ్చర్యమూ ఆనందమూ కలిసి నోటమాటే రాలేదు.

"మీరు గొప్పవారు మర్యాదస్తులు మిమ్మల్ని కోరే హక్కు లేకపోయినా మీ నీడన బ్రతకాలనే కోర్కె అలా అడిగించింది" మాటలు తనను దహించాయి. తానింకా బ్రతికే ఉన్నందు కాశ్చర్యం కలిగింది. తడబడుతూ కౌగిలించుకున్నాడు. శరీరంలో నాగుపాముల బుసబుస. హృదయంలో హాలాహలపు కల్లోలం. కరువు ఓరా ఏడ్వాలన్న కాంక్ష. కట్టలు తెగివస్తున్న కన్నీళ్లను ఆనందభాష్పాలుగా చూపాడామెకు, డగ్గుత్తికతో 'నాకంత అదృష్టమా' అని ఉండలేకపోయాడు రేపు సాయంత్రం డబ్బుతో వస్తానని ముసుర్లో తడుస్తూనే వచ్చాడు.

*　　　*　　　*

సాయంత్రం పోలేదు. రేపు పోవాలి. డబ్బివ్వాలి. ఎలాగైనా చేసి ఇవ్వాలి. తర్వాత . తర్వాత..అదేమిటీ మరుగుతున్న ఆలోచనల్లో మాడిపోతోంది మనసు. పెళ్లి.. నీడ . వందరూపాయల అద్దెగదే నీడా? మర్యాదస్తుడినట, గొప్పవాడినట, ఆస్తట, హక్కట, ఆదుకున్నానట. మోసపోయింది. పూర్తిగా మోస పోయింది. నమ్మింది. అమాయకంగా నమ్మింది. ఎవరూ ప్రేమించని తనను ప్రేమించింది. ఎవరూ నమ్మని తనను నమ్మింది. ఇంకా మోసం చేయలేదు. ఇంకా వేషం వేయలేదు. నిజం తెలుసుకొని పగిలి పోయే ఆమె హృదయం—విలవిలలాడిపోయా డానందరావు. ఇంకా నా మోసం? ఇంకా నా వేషం పోవాలి. పారిపోవాలి పారిపో! పారిపో! పారిపో!

అమ్మయ్య! ముసురు కాస్త తగ్గింది. తగ్గుతున్న ముసురు. ముసురు విసుగు. **కోడి కూస్తోంది.**

చీకటి బ్రతుకూ, చీదర బ్రతుకూ తెల్లవారబోతోంది. మంచం మండి లేచా డానందరావు. కాగితం కలం వెదుక్కొని ల్యాంపు నెగదోశాడు. వణుకుతున్న చేతితో వంకరపోతున్న అక్షరాలు.

"పార్వతీ! నేను నేనుకాదు. నాకు చదువురాని విషయాన్ని నా అక్షరాలే చెపుతాయి. దొంగతనం, దోపిడీ, హత్యలూ నా వృత్తి. ఎన్నోసార్లు జైలుకి పోయి వచ్చాను. నా పేరు మూర్తి కాదు. ఆనంద రావు కే. డి. నన్నెవ్వరూ నమ్మరు, నువ్వు తప్ప నువ్వు మోసపోయావు. ఇంకా మోసగించలేను నేను నీకు తగను. నన్ను మరచిపో ఏభై మాత్రమే ఇవ్వగలిగాను. నన్ను మన్నించు నాకంతే చాలు"

కవర్లో ఉత్తరమూ, రూపాయిలూ పెట్టాడు చీకటి తెరను తొలగించి ఉషస్సు విచ్చుకోబోతోంది. తలుపు వేసి సందు దాటి మలుపు తిరిగాడు. ముసురు తగ్గిన ఆకాశం మీద నల్లని తేలిక మబ్బులు కదులుతూ పోతున్నాయి గబగబా నడిచాడు. తొందరిగా నడచాడు. తలుపు చూసి ఆశ్చర్యపోయా డానంద రావు. తాళం వేసిన తలుపు తలుపుకు వేసిన తాళం. ఇంటి ముసిలిని పిలిచి ఆరా తీశాడు. నిన్న సాయంత్రం మెయిల్లో వెళ్ళిందట. తనకో చీటీని ఇవ్వ మందట. గబగబా విప్పాడు కాగితాన్ని.

"మూర్తిగారూ! నేను నేనుకాదు నే చెప్పిందంతా అబద్ధం. నా గొలుసు గిల్టుగొలుసు. మీరు మంచివారు కాబట్టే మొదటిరోజు పట్టుబడలేదు. నేనన్నివిధాలా చెడిపోయాను. "ఎవరూ నమ్మని నన్ను నమ్మారు. మిమ్మల్నింకా మోసగించలేను. మీరు మంచివారు అమాయకులు. నేను మీకు తగను నన్ను మన్నించండి. నాకంతే చాలు."

ఆనందరావు కన్నుల్లో నీళ్ళు నిండాయి. ఎవరైతే నేం! తనకో హృదయంలో స్థానం దొరికింది. ఒక్క హృదయం తన హృదయాన్ని చూచింది. ఉత్తరం మడచి జేబులో పెట్టుకుంటున్నా డానందరావు. ఎదురుగా ఎర్రటోపి సైకిలాపి దిగింది.

"ఓహో! పాత కేడీ. ఆనందరావా? ఏరా! ఎవర్నో తెచ్చావటగా ఎగిరొచ్చిన పిట్టని! ఇక్కడే పెట్టి బిజినెస్సు నడిపిస్తున్నావటగా! ఎక్కడికి పోయిందిరా పిట్ట? ఎంత సంపాదించావురా! మీ మావు చెప్పాడులే. నడు స్టేషన్‌కి."

బిగుసుకుపోయా డానందరావు. కోపంతో ఉడికి పోయాడు. అవమానంతో కుంగిపోయాడు. దుఃఖంతోను కుమిలిపోయాడు. కాసేపాగిందో లేదో, మళ్లీ ముసురు—మళ్లీ ముసుగు. ముసురు—వెధవముసురు గాలివిసురు. విసుగు—విసుగు. కసిలాంటి విసుగు, నవ్వుకున్నా డానందరావు. అందులో జీవంలేదు. ఆనందంలేదు. కవర్లోంచి యాభై రూపాయలు తీసి కానిస్టేబిల్ చేతిలో ఉంచాడు. ఈసారి వదుస్తున్నానని చెప్పి, ఇంకో క్షణంలో లేడువాడు.

హృదయంలో బాధ. మనసులో దుఃఖం—తడుస్తున్న శరీరం—కండ్లకు అడ్డువచ్చిన నీరు— విషాదంగా నవ్వా డానందరావు. కసిగా నవ్వాడు. "నేను బాధ పడడందేనికి? నా తల్లితండ్రీ పోయినా మేన మావు ఉన్నాడు. నేను బాధపడడం దేనికి" మనసులో అనుకున్నా డానందరావు. అబ్బబ్బ! ముసురు—ముసురు. విసుగు— విసుగు. ముసురు—విసురు. ముసుగు వేసుకున్న ఆకాశం. చీదరించుకున్నా డానంద రావు. జేబులోని బ్లేడుముక్కను పట్టుకుని బీటు బజారు హడావిడిలోకి పోతూ.


# ఐటెక్స్

అలంకరణ సామగ్రి

* ఐటెక్స్ కాటుక
* ఐటెక్స్ బిందీ
* ఐటెక్స్ కుంకుం పేస్ట్




తయారు చేయువారు

అరవింద్ లేబరేటరీస్

పోస్టు బాక్సు నెం. 1415, మద్రాసు-17.



## హమామ్ వల్ల తాజాగాను కాంతిగాను వుండండి




హమామ్‌తో రుద్దుకొని ప్రతి దినము స్నానము చెయ్యండి. హమామ్ మీ శరీరమును శుభ్రపరచుటయే గాక, దానికి కాంతినిచ్చి, హాయిని గొల్పును. ప్రతిరోజూ హమామ్ వాడండి... ఈ సబ్బు మాత్రమే వాడకానికి చాలా రోజులువస్తుంది.

టాటా ఉత్పత్తి

CMTH-3